నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
5 | ఆదివారం 9 జూన్ 2024 | MAHABUBABAD



బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన రాకేశ్‌రెడ్డి

హనుమకొండ, జూన్ 8 : ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల అనంతరం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌ను శనివారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ ప్రతికూల వాతావరణంలో సైతం కాంగ్రెస్ పార్టీకి చుక్కలు చూపించారని, ఇదే స్ఫూర్తితో నిత్యం ప్రజల్లో ఉండాలని కేసీఆర్ రాకేశ్‌రెడ్డికి సూచించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలన్నారు.



ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాలలో గ్రూప్-1 పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

## ఆల్ ది బెస్ట్

### నేడు గ్రూపు-1 ప్రిలిమినరీ పరీక్ష

- ఉదయం 10.30 గంటల నుంచి ఒంటి గంట వరకు
- 10 తర్వాత సెకన్ ఆలస్యమైనా అనుమతి లేదు
- ఉమ్మడి జిల్లాలో 102 పరీక్షా కేంద్రాలు
- హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య 44,260

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 8 : నేడు జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లుచేసింది. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనుండగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 102 సెంటర్లు కేటాయించారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి ఉదయం 9గంటల నుంచి అనుమతిస్తారు. 10గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసి వేస్తారు. 10 తర్వాత ఒక సెకన్ ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించరు. పరీక్ష హాల్లోనికి మొబైల్ ఫోన్స్, స్మార్ట్‌వాచ్, క్యాలిక్యులేటర్, వైట్ పేపర్స్, పెన్ డ్రైవ్, టాబ్లెట్, హియరింగ్ ఫోన్స్ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా అభ్యర్థుల చేతులకు మెహందీ, టాటూలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పరీక్ష ప్రశాంత వాతావరణం నిర్వహించేందుకుగాను పరీక్షా కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అలాగే పరీక్ష కేంద్రానికి సమీపంలో ఉంటే జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకుగాను రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, ప్రతి సెంటర్‌కు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌ను నియమించినట్లు అధికారులు తెలిపారు. హనుమకొండలో 45, వరంగల్‌లో 17, జనగామలో 11, భూపాలపల్లిలో 17, మహబూబాబాద్‌లో 12 సెంటర్లలో ఏర్పాట్లుచేశారు. జిల్లాలవారీగా హనుమకొండలో 22,665, జనగామలో 3,697, వరంగల్‌లో 9,092, మహబూబాబాద్‌లో 4,412, భూపాలపల్లిలో 4,394 మంది పరీక్షకు హాజరుకానున్నారు.



కేయూ రోడ్‌లో హనుమాన్ నగర్ బ్రిడ్జి వద్ద చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని చేపల మార్కెట్‌కు భారీగా తరలివచ్చిన జనాలు

# ఫిష్.. రష్

### ఉమ్మడి జిల్లాలో మృగశిర జోష్



ఏటూరునాగారం మండలకేంద్రంలోని చేపల మార్కెట్ వద్ద కొనుగోలు దారులు



అరుదైన రూప్‌చంద్ చేపతో ఎలుకుర్తికి చెందిన కొమురయ్య

- మార్కెట్లలో చేపలకు భలే గిరాకీ
- చెరువులు, కుంటల వద్ద కుప్పలుతెప్పలు
- కొనుగోలు చేసేందుకు జనం బారులు

మృగశిర కార్తె సందర్భంగా మార్కెట్లు, చెరువులు, కుంటల వద్ద సందడి నెలకొంది. మృగశిర కార్తె రోజు చేపలను తినడం వల్ల వ్యాధులు దరిచేరవని ప్రజల నమ్మకం. ఈ నేపథ్యంలో శనివారం చేపలను కొనుగోలు చేసేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజలు సమీప చెరువులు, కుంటలతోపాటు పట్టణాలు, నగరాల్లో మార్కెట్లకు బారులుతీరారు. తెల్లవారుజాము నుంచే ప్రజలు ఆయా చెరువుల వద్దకు వెళ్లి చేపలు కొనుగోలు చేశారు. డిమాండ్‌ను బట్టి మత్స్యకారులు, వ్యాపారులు చేపలను ఎక్కువ ధరకు విక్రయించారు.

- నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్

## పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో గోల్‌మాల్

- మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా విచారణకు సిద్ధమవుతున్న ఉన్నతాధికారులు
- అక్రమార్కుల గుండెల్లో వణుకు..



మహబూబాబాద్ జూన్ 8 (నమస్తే తెలంగాణ) : పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరులో అధికారితోపాటు ముగ్గురు సిబ్బందిపై రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. తొర్రూరు మండలంలో పెద్ద ఎత్తున పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో డీలర్లు, అధికారులు కుమ్మక్కై వాటిని నల్లగొండ జిల్లాకు పంపించినట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. నేరుగా డీలర్లకు పాస్‌వర్డ్, యూజర్ ఐడీ ఇచ్చి ఇష్టానుసారంగా లెక్కలు తారుమారు చేశారు. సుమారుగా 3 బస్తాల విత్తనాలను ఇతర జిల్లాలకు బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. ఇదే తరహాలో మరిపెడ మండలంలో కూడా అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో విచారణ చేయించేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

**నలుగురు అధికారుల సస్పెండ్**

రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడినా, పంట విత్తనాలను బ్లాక్ మార్కెటింగ్ చేసినా, కల్తీ విత్తనాలు అమ్మినా.. ఎంతటి వారినైనా వదలొద్దని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో తొర్రూరు మండలంలో పచ్చిరొట్ట విత్తనాలను బ్లాక్ మార్కెట్ ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు కారణమైన తొర్రూరు మండల వ్యవసాయాధికారి కే సోమకుమార్ యాదవ్, తొర్రూరు క్లస్టర్ గ్రేడ్-2 ఏఈవో ఎం జమున, అమ్మాపురం క్లస్టర్ ఏఈవో అజ్మీరా దీపిక, హరిపిరాల ఏఈవో సీహెచ్ అరవింద్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ గోపి ఈనెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. మరిపెడ మండలం అసిస్టెంట్ డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు. దీంతో, విచారణ చేపట్టిన మరిపెడ ఏఈ తొర్రూరు మండలంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో పెద్ద ఎత్తున అవకతవకలున్నాయని నివేదిక సమర్పించారు. ప్రధానంగా తొర్రూరు మండల వ్యవసాయాధికారి సోమకుమార్ యాదవ్‌కు చెందిన పోర్టల్ లాగిన్‌ను నిబంధనలకు విరుద్ధంగా ముగ్గురు ఏఈవోలకు ఇవ్వడంతో దీనిని దుర్వినియోగం చేసిన ఆ ముగ్గురు ఏఈవోలు విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించారని తన నివేదికలో ఏడీ పేర్కొన్నారు. దీంతో నలుగురు అధికారులను వ్యవసాయ శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మరిన్ని మండలాల్లో తనిఖీలు చేస్తే ఇంకా అక్రమాలు బయటకు వచ్చే అవకాశముంది.

## 'సబ్సిడీ విత్తనాల బ్లాక్ మార్కెట్'తో మాకు సంబంధం లేదు



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన ఏఈవోలు

### సస్పెండ్ అయిన ఏఈవోల వివరణ

తొర్రూరు, జూన్ 8: సబ్సిడీ విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి విక్రయించిన దందాతో తమకు ఎలాంటి సంబంధం లేదని సస్పెండ్ అయిన ఏఈవోలు తెలిపారు. తొర్రూరు మండలానికి కేటాయించిన పచ్చిరొట్ట జీలుగ విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలించి విక్రయించిన విషయంలో మండల వ్యవసాయ అధికారితో పాటు ముగ్గురు ఏఈవోలను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సస్పెండ్ అయిన హరిపిరాల ఏఈవో సీహెచ్ అరవింద్, అమ్మాపురం ఏఈవో ఏ దీపిక, వెలికట్ల క్లస్టర్ ఏఈవో ఎం జమున శనివారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం తొర్రూరులో విలేకరుల సమావేశంలో వివరణ ఇచ్చారు. తొర్రూరులోని రెండు ఆగ్రోస్ కేంద్రాలు, పీఏసీఎస్, సోమారపుకుంట తండా ఆగ్రోస్ కేంద్రానికి 500 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు కేటాయించగా, తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, విత్తన విక్రయ కేంద్రం నుంచి కూడా క్లస్టర్ల వారీగా ఎలాంటి కేటాయింపు జరగలేదని తెలిపారు. మండల వ్యవసాయశాఖ అధికారి కుమార్‌యాదవ్ మే 22న ఉదయం వాట్సాప్ గ్రూప్‌లో విత్తన కేటాయింపుల గురించి వివరాలు పెట్టారన్నారు. ఈ సమాచారం అందించి విక్రయ కేంద్రం నుంచి కేటాయింపులు చేసేలోపే 50శాతం రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయని చెప్పారు.

ఏవో యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ విక్రయ కేంద్రం వారికి ఇచ్చి వారి ద్వారా ఆన్‌లైన్‌లో పర్మిట్ జారీ చేశారని, విక్రయ కేంద్రం వారు వారికి తోచినవిధంగా రైతుల పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. తమ ప్రమేయం లేకుండా ఆన్‌లైన్‌లోనే రైతుల పేర్లలో పర్మిట్లు జారీ చేశారని, ఈ విషయాన్ని విచారణ అధికారి, మరిపెడ ఏడీఏ శోభన్‌బాబుకు పూర్తిగా వివరించామన్నారు. ఆయన ఇచ్చిన తప్పుడు నివేదికతో సస్పెండ్ చేయడం బాధాకరమని, బ్లాక్ మార్కెట్‌లో విత్తనాల విక్రయంతో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఉన్నతాధికారులు మరోసారి సమగ్ర దర్యాప్తు చేసి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



యార రాజిరెడ్డి(ఫైల్)

చిట్యాల(మొగుళ్లపల్లి), జూన్ 8 : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యార రాజిరెడ్డి(58) తన ఇంట్లోని వడ్లు పట్టించేందుకు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి టాటా ఏస్ వాహనాన్ని కిరాయికి మాట్లాడుకున్నాడు. వాహనం ఇంటి ఆవరణలోకి వస్తుండగా, కరెంటు సర్వీస్ వైరు తగులుతుందని భావించి చేతితో పైకి ఎత్తాడు. వైరు పేలిపోయి ఉండడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రాజిరెడ్డి భార్య యార పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

## వీధికుక్కల దాడిలో బాలుడు మృతి



గుగులోత్ శివరామ్ (ఫైల్)

చిల్పూరు, జూన్ 8 : వీధి కుక్కల దాడిలో బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని లూనావత్‌తండాలో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఫతేపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లూనావత్‌తండాకు చెందిన గుగులోత్ మధు, సరిత దంపతుల కుమారుడు గుగులోత్ శివరామ్ (6) శనివారం తన తండ్రితో కలిసి ట్రాక్టర్‌పై పొలం వద్దకు వెళ్లాడు. తన వెంట వద్దు.. ఇంటికి వెళ్లమని మధు చెప్పగా శివరామ్ ఒక్కటే ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో దారిలో వీధి కుక్కలు దాడి చేయడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి మధు ఇంటికి వచ్చి కొడుకు కోసం వెతుకుతుండగా, వీధి కుక్కలు దాడిలో మృతి చెందినట్లు స్థానికులు తెలుపడంతో బోరున విలపించాడు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

## గోదావరి నీళ్ల కోసం..





గోదావరి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న టేకులగూడెం చెలక గ్రామస్తులు

- కాలి నడకన రెండు కిలోమీటర్లు ప్రయాణం
- బిందెలు, క్యాన్లతో తెచ్చుకుంటున్న వైనం
- నాలుగు రోజుల క్రితం మరమ్మతుకు గురైన మోటర్
- గోస తీర్చాలంటున్న టేకులగూడెం చెలక గ్రామస్తులు

వాజేడు, జూన్ 8 : తాగు నీటి కోసం ములుగు జిల్లా వాజేడు మండలంలోని తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంత టేకులగూడెం చెలక గ్రామస్తులు తండ్లాడుతున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలోని గోదావరికి కాలి నడకన వెళ్లి తెచ్చుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో మిషన్ భగీరథతో పాటు బోరు నీళ్లు ఉన్నప్పటికీ గ్రామస్తులు మాత్రం గోదావరి నీటిని తాగేందుకు ఇష్టపడతారు. ఈ నేపథ్యంలో గ్రామానికి తాగు నీరందించేందుకు గోదావరి వద్ద ఏర్పాటు చేసి మోటర్ నాలుగు రోజుల క్రితం మరమ్మతుకు గురైంది. దీంతో గ్రామస్తులు చిన్న, పెద్ద తేడా లేకుండా బిందెలు, డబ్బాలు తీసుకొని కాలి నడకన గోదావరికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి తమ ఇబ్బందులు తీర్చాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి బందం రవీందర్‌ను 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో వివరణ కోరగా, గ్రామానికి సరిపడా బోరు, మిషన్ భగీరథ నీళ్లున్నాయని, గ్రామస్తులు గోదావరి నీళ్లు మాత్రమే తాగుతారన్నారు. గోదావరి నీటిని పంపింగ్ చేసే మోటర్ మరమ్మతుకు గురైందని, దానిని రిపేర్ చేసి నీరందేలా చూస్తానని తెలిపారు.

## వచ్చీరాని వైద్యం.. చెయ్యి మాయం!

- ఆర్ఎంపీ నిర్లక్ష్యంతో దెబ్బతిన్న వైనం
- తొలగించాలనడంతో కొడుకు, కోడలు ఆవేదన



ఐనవోలు: పూర్తి నల్లగా మారిన ఉప్పలమ్మ చెయ్యి

ఐనవోలు, జూన్ 8 : ఆర్ఎంపీ వైద్యుడు చేసిన వచ్చిరాని వైద్యంతో ఓ వృద్ధురాలి చెయ్యిని తొలగించాల్సి పరిస్థితి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రానికి చెందిన గందేపల్లి ఉప్పలమ్మ అనే వృద్ధురాలి(59)కి గతేడాది పక్షవాతం వచ్చి కుడి చెయ్యి పని చేయకుండా పోయింది. గత నెల 30న గురువారం ఉప్పలమ్మకు వాంతులు కాగా, శుక్రవారం స్థానికంగా ఉన్న ఆర్ఎంపీతో వైద్యం చేయించారు. నీరసంగా ఉండడంతో ఆమెకు ఇంటి దగ్గరే ఎడమ చెయ్యికి గ్లూకోజ్ పెట్టాడు. రెండో రోజున చెయ్యి కొంచెం నల్ల బడిందని కొడుకు రాజు, కోడలు అపర్ణ ఆర్ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా, ఏమీకాదంటూ మళ్లీ రెండు ఇంజెక్షన్లు వేశాడు. చెయ్యి పరిస్థితి మరింత విషమంగా మారడంతో బుధవారం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా ఉప్పలమ్మను పరీక్షించిన వైద్యుడు సమస్య తీవ్రంగా ఉంది. దీనికి సంబంధించిన వైద్యం వరంగల్‌లో లేదని నిమ్స్‌కు రెఫర్ చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు ఉప్పలమ్మను ఈ నెల 6న గురువారం ఉదయం నిమ్స్ తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు చెయ్యికి ఇన్‌స్పెక్షన్ ఉందని, తొలగించాల్సి వస్తుందని, హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా లేక వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేర్పించాలని సూచించారు. దీంతో బాధితులు గురువారం సాయంత్రం ఎంజీఎం దవాఖానలో చేర్పించారు. శుక్రవారం ఉదయం ఉప్పలమ్మను పరీక్షించిన వైద్యులు చెయ్యిని తొలగించాలని సూచించారు. సర్జికల్ వార్డులో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. గతంలో పక్షవాతం కారణంగా కుడి చెయ్యి పని చేయకుండా పోయింది. ఇప్పుడు ఆర్ఎంపీ వైద్యం వికటించి ఎడమ చెయి కోల్పోబోతుందని కొడుకు రాజు, కొడులు అపర్ణ కన్నీరుమున్నీరు విలపిస్తున్నారు.